క్లుప్తంగా

కల్యాణ మండప నిర్మాణానికి సహకరించండి

సామర్లకోట: స్థానిక బలుసులపేట అల్లూరి సీతారామరాజు పార్కు సమీపంలోని 31 సెంట్ల ఖాళీ స్థలంలో అంబేడ్కర్ కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ స్థలం గతంలో బహిరంగ మరుగుదొడ్డిగా ఉండేదన్నారు. ఈ ఖాళీ స్థలంలో కల్యాణ మండపాన్ని నిర్మించుకునేందుకు వీలుగా గత మున్సిపల్ కౌన్సిల్ కూడా తీర్మానాన్ని ఆమోదించిందని హరిబాబు తెలిపారు. ఈ తీర్మానాన్ని పరిశీలించి కల్యాణ మండపం నిర్మాణానికి ఎంపీ గ్రాంట్ నిధులు కేటాయించేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

కొత్తపల్లి: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో గృహ నిర్మాణాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులందరూ గృహాలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ లేఅవుట్‌ల్లో సకల మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ప్రతి శనివారం ప్రభుత్వం హౌసింగ్ డేగా ప్రకటించిందని చెప్పారు.

భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో మంగళవారం భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సుగంధ జలాలతో కూడిన 108 కలశాలతో గ్రామోత్సవం నిర్వహించి ఆ జలాలతో స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు ద్విభాష్యం సుబ్రహ్మణ్య శాస్త్రి, కవి కిరణ్ శర్మల ఆధ్వర్యంలో మహా గణపతి పూజ, కలశ ఆవాహనాలు నిర్వహించారు.

గ్యాస్ పైపులైన్‌తో తీవ్ర నష్టం

కొత్తపల్లి: గ్యాస్ పైపులైన్ పంట పొలాల్లో ఏర్పాటు చేస్తే తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని గోర్స గ్రామానికి చెందిన రైతులు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గ్యాస్ పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లుగా నోటీసులిచ్చారని, రైతుల అంగీకారం లేకుండా పైపులైన్ ఏర్పాటును విరమించుకోవాలన్నారు. పైపులైన్ ఏర్పాటుతో చిన్న, సన్నకారు రైతులు భూములు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో రైతులు ఎంఎస్ రాజు, పి.కాశీ, కె.సూరిబాబు, వి.సత్యనారాయణ తదితరులున్నారు.

ఉగాదికి జగనన్న కాలనీలు పూర్తి చేయాలి

సామర్లకోట: ఉగాది నాటికి మండలంలో జగనన్న కాలనీల నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. దీనిపై మంగళవారం సాయంత్రం వివిధ శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. హౌసింగ్ అధికారులు కాలనీలకు రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. అదే విధంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి సదుపాయానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల పరిధిలోనే హౌసింగ్ చైర్మన్ ఉండడంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

బాలికల విద్యకు ఎంతో ప్రాధాన్యం

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం బాలికల విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవ్ గర్ల్ చైల్డ్ అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. బాలికలు ఝాన్సీలక్ష్మీబాయి, సావిత్రిబాయి పూలే, పీటీ ఉష, మదర్ థెరిసాల వేషధారణలతో పాటు సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. విద్యార్థినులకు సాయిరామకృష్ణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయుడు తాళ్లూరి వైకుంఠం, ఉపాధ్యాయులు కె.అరుణ, ఏఎల్‌వీ కుమారి, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణాల్లో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

- కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి

పిఠాపురం: ఆటోలు నడిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే ఆటోలో ఉన్న ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ ఏర్పడుతుందని కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. పిఠాపురం సీఐ కార్యాలయంలో మంగళవారం రాత్రి నియోజకవర్గ ఆటో యూనియన్ నాయకులతో నిర్వహించిన రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహనా సదస్సుకు ఆయన హాజరై ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. మద్యం సేవించడం, పెద్ద సౌండ్లతో ప్లేయర్స్ వాడడం నిబంధనలు పాటించకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాలకు అవకాశమేర్పడుతుందన్నారు. కార్యక్రమంలో పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్‌ఐలు రామలింగేశ్వరరావు, అబ్దుల్ నబీ, జగన్మోహన్, వినయ్‌ప్రతాప్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకూ..



పిఠాపురంలో ప్రభుత్వ పథకాల్ని వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు



జి.రాగంపేటలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం
- జి.రాగంపేట దొరబాబు గడప గడపకూ..

పిఠాపురం: ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మంగళవారం ఆయన పిఠాపురం 15, 27 వార్డుల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పిఠాపురం 8వ వార్డు డ్రైవర్స్ కాలనీలో డ్రైన్లకు అవుట్‌లెట్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు ఆయనకు వివరించారు. సమస్య పరిష్కారానికి మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులతో సమీక్షించి అవసరమైతే నిధులు కేటాయించి త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామం, వార్డులోను సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. ప్రజల్లో ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఎల్లో మీడియా ద్వారా బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ చైర్‌పర్సన్ వర్దినీడి సుజాత, వైఎస్సార్ సీపీ నేతలు బొజ్జా రామయ్య, గండేపల్లి బాబీ, బాలిపిల్లి రాంబాబు, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళుతూ.. సమస్యలు తెలుసుకుంటూ..

పెద్దాపురం : ఏ రాష్ట్రంలోనూ సాధ్యం కాని ప్రజా సంక్షేమ పాలన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో సాధ్యపడిందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని జి.రాగంపేట గ్రామంలో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బంగారు కృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు కాలి అనురాధ, కన్వీనర్ కేఈడీ రాజు, ఎలుబండి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సుమారు మూడున్నర గంటల పాటు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలసి గ్రామంలోని గడపగడపనూ సందర్శించారు. సచివాలయం పరిధిలో ప్రజలకు అందుతున్న ప్రజా సంక్షేమ పథకాలపై ఆయన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ళస్థలాల పట్టాలు ఇప్పించాలని, డ్రెయిన్లు నిర్మించాలని, ఇతర మౌలిక వసతులు కల్పించాలని భాస్కర కాలనీ వాసులు దొరబాబును కోరారు. ఇందుకు తనవంతు కృషి చేస్తానని దొరబాబు హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అక్కడి ప్రజలు సంతృప్తి వ్యక్తం చేయడంతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు, నరాలశెట్టి త్రినాథ్, మాదిరెడ్డి రాంబాబు, లక్కాకుల నానాజీ, సుందరెడ్డి రాజు, రాజుబాబు, వైవీకే సాయి, సిరిపురపు వడ్డికాసులు, నాళం త్రిమూర్తులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై అవగాహన పెంచాలి



మెప్మా సీఓల సమావేశంలో సామర్లకోట కమిషనర్, హౌసింగ్ డీఈ తదితరులు

సామర్లకోట: స్థానిక ఈటీసీ లేఅవుట్‌లో నిర్మిస్తున్న జగనన్న కాలనీపై గృహ లబ్ధిదారులకు అవగాహన పెంచాలని మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్ అన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మెప్మా సీఓలకు కమిషనర్ చాంబర్లో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం మూడో ఆప్షన్ కూడా ఇచ్చిందన్నారు. దీనిలో లబ్ధిదారులు కేవలం రూ.35 వేలు చెల్లిస్తే ప్రభుత్వం మంజూరు చేసే ఆర్థిక సహాయం రూ.1.80 లక్షలు జత చేసి, మొత్తం రూ.2.15 లక్షలకే ఇంటిని నిర్మించి లబ్ధిదారులకు ఇస్తామన్నారు. ఈ ప్రతిపాదనకు ఇప్పటికే 700 మంది లబ్ధిదారులు ముందుకు వచ్చారని తెలిపారు. ఈటీసీ లేఅవుట్‌లో 2,444 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. వారి లో 1200 మంది ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారని తెలిపారు. మిగిలిన వారికి అవగాహన కల్పించాలన్నారు. హౌసింగ్ డీఈ ఎస్‌ఆర్‌కే రాజు మాట్లాడుతూ కాంట్రాక్టర్ ద్వారా ఇంటి గోడలు కాంక్రీట్‌తో నిర్మిస్తామన్నారు. ఈ విషయాన్ని ముందుగానే లబ్ధిదారులకు తెలియ జేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఎం. వెంకటేశ్వరరావు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ దుర్గాప్రసాద్

సామర్లకోట: ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ కె.దుర్గాప్రసాద్ సూచించారు. పట్టణంలోని ఆటో డ్రైవర్లతో స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆటోకు బీమా తప్పనిసరిగా ఉండాలన్నారు. వాహనాలకు థర్డ్ పార్టీ బీమా ఉంటే ప్రమాదాలు జరిగినపుడు బీమా సంస్థ నుంచి కొంత మేర పరిహారం అందే అవకాశం ఉంటుందన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ కాకినాడ జిల్లాలో సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో 38 మంది చనిపోయారని, వాటిలో కేవలం ఆటో ప్రమాదాల్లోనే 14 మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన చెప్పారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లరాదన్నారు. ప్రతి ఆటోలో డ్రైవింగ్ లైసెన్సుతో పాటు సి బుక్, బీమా రికార్డు ఉండాలన్నారు. కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే ఆటోలకు పార్కింగ్ చేయాలని సూచించారు. ఆటో డ్రైవర్లు విధిగా ఖాకీ యూనిఫాం ధరించాలన్నారు. రోడ్డు మధ్యలో ఆటోలను నిలిపితే చర్యలు తప్పవని సీఐ దుర్గా ప్రసాద్ హెచ్చరించారు. మద్యం సేవించి ఆటోలను నడిపితే ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై రత్నం, ఆటో యూనియన్ ప్రతినిధులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

'పది'లో మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలి

- డీఈఓ సుభద్ర



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సుభద్ర

పిఠాపురం: త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్ష ల్లో మంచి ఫలితాలు సాధించడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని డీఈఓ సుభద్ర సూచించారు. పిఠాపురం బీఎమ్మార్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పిఠాపురం డివిజన్ స్థాయి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రతి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 60 రోజుల ప్రత్యేక అభ్యసనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోజువారీ పరీక్షలు నిర్వహించడం ద్వారా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. సబ్జెక్టు టీచర్స్ విద్యాశాఖ ఉన్నతాధికారుల సూచనలు కచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్, డీసీఈబీ సెక్రటరీ వెంకట్రావు, ఎంఈఓ తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల వేళ అప్రమత్తత అవసరం

- రెడ్ క్రాస్ డాక్టర్ పరాషర
- ఈటీసీలో ఆపద మిత్రలకు కొనసాగుతున్న శిక్షణ

సామర్లకోట: అగ్ని ప్రమాదాలపై ఆపద మిత్రలు అప్రమత్తంగా ఉండాలని తుని అగ్నిమాపక అధికారి డి.రామకృష్ణంరాజు, రెడ్ క్రాస్ డాక్టర్ సి.పరాషర అన్నారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 110 మంది ఆపద మిత్రలకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో రెండు తరగతి గదుల్లో శిక్షణ ఇస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా ఆరో రోజు మంగళవారం వారికి అగ్నిమాపక అధికారులు, రెడ్‌క్రాస్ సిబ్బంది నిర్వహించారు. ప్రమాదాలు జరిగినపుడు ప్రాథమిక చికిత్స ఎలా అందించాలో పరాషరా వివరించారు. ప్రాథమిక చికిత్సపై ఆమె డెమో చేసి ఆపద మిత్రలకు చూపించారు. ఇళ్లలోని గ్యాస్ సిలిండర్ల పట్ల కూడా మహిళలు అప్రమత్తంగా ఉండేలా ఆపద మిత్రలు చైతన్యవంతం చేయాలన్నారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక, అత్యవసర సేవలకు సమాచారం అందించాలన్నారు. విలువైన వస్తువులు కాలిపోతున్నాయంటూ బాధితులు మంటల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో విపత్తుల నివారణ సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు కిరణ్మయి, ఫ్యాకల్టీలు ప్రసాద్, ఆంజనేయులు శిక్షణ ఇచ్చారు.

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



ఉప్పాడలో సచివాలయ రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి

కొత్తపల్లి: గ్రామ సచివాలయాలకు వచ్చే అర్జీలను సిబ్బంది ఎప్పటికప్పుడు పరిష్కరించాలని డీఎల్‌డీఓ నారాయణమూర్తి అన్నారు. మండలంలోని ఉప్పాడలో ఉన్న గ్రామ సచివాలయాలను, ఆధార్ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. సచివాలయాల్లో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు హాజరు కావాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలను నోటీస్ బోర్డులో ఉంచాలన్నారు. ఆధార్ నమోదు కేంద్రం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం



చేబ్రోలులో ఆలయాల నిర్మాణ స్థలాలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ నాగ లోవరాజు

పిఠాపురం: గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని జెడ్పీటీసీ నాగ లోవరాజు అన్నారు. ఆయన జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారి పులి నారాయణమూర్తి, అన్నవరం దేవస్థానం డీఈ ఉదయ్‌కుమార్‌లతో కలిసి గొల్లప్రోలు మండలం చేబ్రోలులో నిర్మించనున్న పలు ఆలయాల నిర్మాణ స్థలాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పెండెం దొరబాబు వినతి మేరకు ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి ట్రస్టు ద్వారా చేబ్రోలులో ఈబీసీ కాలనీ, పాత ఎస్సీపేట, శెట్టిబలిజ పేటల్లో రామాలయాలు, అరుంధతీ పేటలో సత్తెమ్మ తల్లి ఆలయాల నిర్మాణానికి ఒక్కోదానికి రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించారని చెప్పారు.

గోదావరి జలాలను కలుషితం కానీయకండి



ఈఓకు వినతి పత్రం అందజేసిన మానవ హక్కుల సంఘ నాయకులు

సామర్లకోట: గోదావరి కాలువ నీరు కలుషితం కాకుండా చూడాలని మానవ హక్కుల సంఘ నాయకులు మంగళవారం పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీసమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. మహాశివరాత్రి సందర్భంగా వేలాది భక్తులు పంచారామ క్షేత్రానికి వచ్చి గోదావరి కాలువలోను, ఆలయ కోనేరులోను పుణ్యస్నానాలు ఆచరిస్తారన్నారు. గోదావరి కాలువలో ఎగువన ఉన్న జి.మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్ పురం గ్రామాల్లో వ్యర్థ జలాలు కలుస్తున్నాయన్నా రు. ఈ కారణంగా గోదావరి కాలువలో స్నానాలు చేసే భక్తులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. అదీగాక గోదావరి జలాలనే ఆలయ కోనేరులో నింపుతారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని మహాశివ రాత్రికి 10 రోజుల ముందుగా గోదావరి కాలువలో ఈ మూడు గ్రామాల నుంచి వ్యర్థ జలాలు కలవకుండా చూడాలన్నారు. ఈ మేరకు ఆర్డీఓ సమక్షంలో జరిగే మహాశివరాత్రి ఏర్పాట్ల సమావేశానికి ఆయా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఎడ్మిన్‌లు హాజరయ్యేలా చూడాలన్నారు. మానవ హక్కుల సంఘం వినతి పత్రాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకువెళతామని ఈఓ తెలిపారు.

కాకినాడ - శ్రీకాకుళం ఏపీజీడీసీ పైపులైను

కొత్తపల్లి: కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకూ సుమారు 305 కిలోమీటర్ల మేర ఆంధ్రప్రదేశ్ గ్యాస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీజీడీసీ) పైపులైను నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి తెలిపారు. పైపులైను ఏర్పాటు నేపథ్యంలో గోర్స, కొమరగిరి రైతులతో మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. పైపులైను ఏర్పాటుపై అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని చెప్పారు. కాకినాడ, కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు, తొండంగి, తుని మండలాల్లోని 27 గ్రామాల మీదుగా పైపులైను వేస్తున్నామన్నారు. ఇందుకోసం 20 మీటర్ల భూమి తీసుకుని, 5 మీటర్ల మేర పైపులైను నిర్మిస్తామన్నా రు. భూమి తీసుకున్నప్పుడు రైతులకు రెండు పంటలకు సంబంధించిన పరిహారా న్ని కూడా చెల్లిస్తామని తెలిపారు. పైపులైను వేసిన భూమిలో యథావిధిగా పంట పండించుకోవచ్చునని సుధారాణి స్పష్టం చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దారు ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

సామర్లకోట: విద్యార్థి ఆటోలో మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను, బ్యాగ్‌ను పోలీసులు మంగళవారం ఆ విద్యార్థికి అందజేశారు. సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఆటో ఎక్కిన దాసరి మోహన్ స్థానిక మఠం సెంటర్‌లో ఆటో దిగి ల్యాప్‌టాప్‌ను బ్యాగ్‌తో సహా మరచిపోయి వెళ్లిపోయాడు. దీనిని గమనించిన ఆటో డ్రైవరు సత్యనారాయణ, యూనియన్ అధ్యక్షుడు ఆర్. చిన్నాతో కలిసి ల్యాప్‌టాప్‌ను శనివారం రాత్రి సీఐ దుర్గాప్రసాద్‌కు అందజేశారు. ల్యాప్‌టాప్‌ను ఆటోలో మరిచి పొయిన విద్యార్థి దాని కోసం ఆటో స్టాండ్‌లో వాకబు చేశాడు. సీఐ వద్ద ల్యాప్‌టాప్ ఉందని తెలుసుకున్నారు. అయితే రెండు రోజులుగా సీఐ అందుబాటులో లేకపోవడంతో జాప్యం జరిగింది. దీనిపై సీఐ విద్యార్థికి కౌన్సెలింగ్ ఇచ్చారు. హెచ్‌సీ రాజు ద్వారా విద్యార్థి ల్యాప్‌టాప్ తీసుకున్నాడు.

నేటి నుంచి శ్రీపాద వల్లభ స్వామి ఆవిర్భావ ఉత్సవాలు

పిఠాపురం: ఈనెల 25వ తేదీ బుధవారం నుంచి పిఠాపురం శ్రీపాద వల్లభ మహాసంస్థానంలో ఉన్న శ్రీపాద వల్లభ స్వామి 703వ ఆవిర్భావ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యంలో మంగళవారం మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు పిఠాపురం చేరుకున్నారు. ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు తెలిపారు. ఈసందర్భంగా ప్రతి రోజు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, హోమాలు, గ్రామోత్సవాలు, గోపూజలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

మంచి సమాజ నిర్మాణానికి కళలు దోహదం



రిబ్బన్ కట్ చేసి నాటక కళా పరిషత్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ అబ్బిరెడ్డి, ఆప్కో డైరెక్టర్ ముప్పన
- చంద్రమాంపల్లిలో రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు ప్రారంభం
- స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహణ



'గుడి ఎనక నా సామి' నాటికలోని సన్నివేశం

పెద్దాపురం: మంచి సమాజాన్ని నిర్మించడానికి కళలు, అందులోనూ నాటకాలు ఎంతో దోహదం చేస్తాయని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ, ఎంపీడీవో అబ్బిరెడ్డి రమణారెడ్డి, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, చంద్రమాంపల్లి సర్పంచ్ కురిమెళ్ల లోవరాజు అన్నారు. మండలంలోని చంద్రమాంపల్లిలో స్నేహ ఆర్ట్స్ రాష్ట్రస్థాయి చతుర్థ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే మంగళవారం రాత్రి నాటిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గోందేశి రాజా అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో వారు మాట్లాడారు. మానవతా విలువలకు ప్రతిరూపమే నాటకం అన్నారు. గ్రామీణుల జీవన విధానాలను, సామాజిక సంబంధాలను నాటకాలు, కళారూపాల ద్వారా వ్యక్త పరచారన్నారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి కేదారి నాగు, డి.క్రాంతికుమార్ కూడా ప్రసంగించారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో నటశేఖర కృష్ణ, అబ్బిరెడ్డి వెంకట సూర్యనారాయణరెడ్డి కళాప్రాంగణాన్ని ప్రారంభించారు. సినీ నటులు కృష్ణ, ఏవీఎస్ రెడ్డి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశాఖపట్నం ఉక్కునగరం 'గుడి ఎనక నా సామి' హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్స్ వారిచే ' ''దా''రుణం' నాటికలను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలుగా కె.శాంతారావు, గోగులపాటి రాంబాబు, డాక్టర్ ప్రసాద్ వ్యవహరించారు. కార్యక్రమంలో గుడివాడ సర్పంచ్ కనపర్తి చీమదొర, కొమ్మిరెడ్డి బుజ్జి, ఇందన బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

దైవాన్ని మనసులో వెతకండి

నాటక కళా పరిషత్ పోటీల్లో భాగంగా విశాఖపట్నం ఉక్కునగరం చైతన్య కళా స్రవంతి వారిచే సిగ్గ రచించిన బాలాజీ నాయక్ దర్శకత్వంలో 'గుడి ఎనక నా సామి' నాటికను ప్రదర్శించారు. మనిషి తనంలోని దైవత్వాన్ని వదిలేసి ఎదుటివారిలో వెతకడం ప్రారంభిస్తున్న నేటి తరుణంలో దొంగబాబాలు, దొంగస్వాములు పుట్టుకొస్తూ ఉంటారు. అనే సారాంశంతో కథ కొనసాగింది. ముగ్గురు నిరుద్యోగులు తమకు అందివచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రజలను ఎలా మోసం చేశారో.. నేటి సమాజంలో ఎలా జరుగుతుందో వివరిస్తూ నాటికను ప్రదర్శించారు. నిజమైన దైవం ఎప్పుడూ మోసం చేయదని, దేవుడు పేరుతో జరిగే మోసాలను ఆపడం ముఖ్యమని చెబుతూ నాటికను ముగించారు. ఈ నాటికలో బాలాజీనాయక్, రామారావు, భానులు నటించగా రంగాలంకరణ, ఆహార్యం థామస్, సంగీతం లీలా మోహన్ అందించారు.

యాప్‌ల పేరుతో దా'రుణాలు'

టెక్నాలజీ అభివృద్ధి చెందిన తరువాత లోన్ యాప్‌ల పేరుతో ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నారో, దానివల్ల ప్రజలు ఎంత అవస్థలు పడుతున్నారో పరమాత్మున్ని శివరాం రచించి, దర్శకత్వం వహించిన హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్ వారు దా'రుణం' నాటికలో చూపించారు. లోన్ యాప్‌ల ద్వారా మనల్ని, మన ఆర్థిక వ్యవస్థనే బలహీనపర్చాలని చూస్తున్నారని, సైబర్ నేరగాళ్లు చేస్తున్న అనేక బ్లాక్ మెయిల్‌తో ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని నాటికలో చెబుతూ ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదని చెబుతూ ఇతివృత్తాన్ని చూపించారు. సునయిన, గోవర్ధన్, శివరామ్, మంజునాథ్‌లు నటించగా రంగాలంకరణ, ఆహార్యం సురభి ఉమాశంకర్, సంగీతాన్ని సురభి నాగరాజు అందించారు.